క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిడమర్రు: విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ, లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏలూరు ఈఈ శశిధర్ తెలిపారు. మండలంలోని పెదనిండ్రకొలను, బువ్వనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: శ్రీ రాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీ రాట్నాలమ్మ అమ్మవారికి శ్రావణ పౌర్ణిమ సందర్భంగా అష్టోత్తర శత కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ పూజాది కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు విజయవాడ వాస్తవ్యులు రావాడ చిరంజీవి దంపతులు అభిషేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్ కుమార్ పర్యవేక్షించారు.

చెట్టుకు రాఖీ కట్టిన తెలుగు ఉపాధ్యాయుడు



గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో చెట్టుకు రాఖీ కట్టిన ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్

దెందులూరు: మానవ సంబంధాలతో పాటు వృక్ష సంబంధాలు కూడా భావితరాల భవిష్యత్‌కు అవసరమని గోపన్నపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మాసగిరి శ్రీనివాస్ అన్నారు. రాఖీ పర్వదినం సందర్భంగా గురువారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో తరగతి గదులు ఎదుట ఉన్న చెట్టుకు భారీ రాఖీని ఆయన కట్టారు. ఈ సాంప్రదాయం కొనసాగాలని కోరుకుంటున్నానని, మానవ సంబంధాలు, కుటుంబ వ్యవస్థలు బలోపేతం చేయడానికి ఉపయోగపడితే వృక్ష సంబంధం సమాజానికి ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.

బోధనలో మెలకువలను ఉపయోగించాలి

ఉంగుటూరు: పాఠ్యాంశాల బోధనలో నేర్చుకున్న మెలకువలను తరగతి బోధనలో ఉపయోగించాలని ఉంగుటూరు-2 ఎంఈవో కె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉంగుటూరు హైస్కూల్‌లో కాంప్లెక్స్ చైర్మన్ సీహెచ్ పద్మశ్రీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్లాస్ రూమ్ బేస్డ్ శిక్షణ నిర్వహించారు. బాదంపూడి, బొమ్మిడి, ఉంగుటూరు కాంప్లెక్సులోని ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, సీఆర్‌పీలు మరియమ్మ, విష్ణు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఏలూరు రూరల్: రాజకీయ పార్టీలు, వర్గ భేదాలు లేకుండా అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. గురువారం ఏలూరు మండలం శ్రీపర్రులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ సైదు భాగ్యలక్ష్మి ఆధ్వర్యాన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అర్హత ఉన్నవారిని గుర్తించి ప్రభుత్వ పథకాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి ఆశయం సైతం ఇదే అన్నారు. అనంతరం ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను కలిసి వారికి అందుతున్న పథకాలపై ఆరా తీశారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి ఆయన ఆదేశించారు. తొలుత గ్రామంలో రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, వడ్డీల కార్పొరేషన్ చైర్మన్ సైదు గాయత్రి సంతోషిణి, ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు మండల సరస్వతి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, మండల కొండలరావు పాల్గొన్నారు.



శ్రీపర్రులో సచివాలయ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

సబ్జెక్ట్ కాంప్లెక్స్ కీలకం

దెందులూరు: సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాలు అతి ముఖ్యమైనవని దెందులూరు మండల విద్యాశాఖాధికారి ఎవీఎస్‌వీ ప్రసాద్‌అన్నారు. గురువారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో సైన్స్ సబ్జెక్టు కాంప్లెక్స్‌సమావేశం హెచ్‌ఎం ఎస్ఎస్ఎల్ వీజీ శర్మ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి రోజూ ఉపాధ్యాయులు బోధనలు మరింత సులభతరంగా ఉండాలని సూచించారు.

ఐఈఆర్‌సీ సెంటర్‌ను తనిఖీ చేసిన ఎంఈఓ

ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థుల కోసం చేస్తున్న సేవలను, కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. గురువారం కొవ్వలి ప్రాథమిక పాఠశాలలో ఐఈఆర్‌సీ సెంటరును తనిఖీ చేశారు. విద్యార్థులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సేవలు, సత్ఫలితాలు, తల్లిదండ్రుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మరిన్ని మెరుగైన సేవలందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కోరారు.

ఘనంగా పెదబాబు ప్రమాణ స్వీకారం

నిడమర్రు: టీటీడీ నూతన పాలక మండలి సభ్యునిగా గాదిరాజు వెంకట సుబ్బరాజు (పెదబాబు) గురువారం తిరుపతిలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో పెదబాబు కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఆలయ పండితులతో కలసి పెదబాబును సత్కరించారు.

నేడు స్వాగత ర్యాలీ

టీటీడీ నూతన పాలకవర్గ సభ్యునిగా గురువారం ప్రమాణం చేసి తొలిసారి నియోజకవర్గానికి వస్తున్న గాదిరాజు వెంకట సుబ్బరాజు (పెదబాబు)కు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం భారీగా స్వాగత ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది రవి, సుభాష్ తెలిపారు. ఆకివీడు నుంచి నియోజకవర్గంలోకి వస్తున్న సుబ్బరాజుకు సరిపల్లిలో ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎమ్మెల్యే వాసుబాబుతో కలిసి టీటీడీ సభ్యులు పెదబాబు బైక్‌లతో ర్యాలీగా ప్రారంభమై గణపవరం, బువ్వనపల్లి మీదుగా నిడమర్రు చేరుకుంటారు. అక్కడ నుంచి ఉంగుటూరు మండలం రాచూరు, రావులపర్రు, పత్తేపురం మీదుగా పెదనిండ్రకొలను గ్రామానికి చేరుకుంటారన్నారు.



పెదబాబు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ప్రతి నెలా 1న పౌష్టికాహారం అందించాలి

పెదవేగి : అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని ప్రతి నెలా 1వ తేదీన తప్పనిసరిగా అందించాలని పెదపాడు సీడీపీఓ కె.విజయలక్ష్మి తెలిపారు. గురువారం పెదవేగిలోని 122 అంగన్‌వాడీ కేంద్రంలో పెదవేగి సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీడీపీవో విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతినెలా 29వ తేదీన పౌష్టికాహార నిల్వలను చూసుకుని ఆయా సూపర్‌వైజర్ల ద్వారా సమాచారం తెలియజేయాలని ఆమె అన్నారు. పౌష్టికాహార సరుకులు తీసుకునే మహిళలకు ముందుగానే సమాచారం అందించి ఒకటవ తేదీన సరుకులను అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె అన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు బాల్య వివాహాలపై దృష్టి పెట్టడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, అనురాధ, బేబీ సరోజినీ, తులసీ, శిరోమణి, ఉషారాణి, మల్లిక, పద్మ, రమాదేవి, నాగభూషణమ్మ, మణి తదితరులు పాల్గొన్నారు.



పెదవేగిలోని సెక్టార్ సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి

నేడు ఎమ్మెల్యే వాసుబాబు పర్యటన ఇలా..

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శుక్రవారం ఉదయం 10 గంటలకు గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన 12 గదుల అదనపు తరగతి భవనాలను ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గణపవరం సలాదివారి వీధిలో రామాలయం వద్ద ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటలకు టీటీడీ బోర్డు సభ్యుడు గాదిరాజు సుబ్బరాజుతో కలసి గణపవరం మండలం సరిపల్లె నుంచి పెదనిండ్రకొలను వరకూ నిర్వహించే స్వాగత, అభినందన ప్రదర్శనలో పాల్గొంటారన్నారు.

డ్వాక్రా సంఘాలకు నాటు కోళ్ల పంపిణీ

భీమడోలు: ఆరోగ్యం, పౌష్టికాహారం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని డ్వాక్రా సంఘాల మహిళలకు గురువారం నాటు కోళ్లు పంపిణీ చేసినట్లు ఏపీఎం పి.సురేష్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని 50 యూనిట్లు ఎంపిక చేసిన డ్వాక్రా సంఘాలకు వీటిని అందజేశామన్నారు ఒకొక్క యూనిట్‌లో 13 నాటు కోళ్లు ఉంటాయని, వాటిలో 9 కోడి పెట్టలు, 3 పుంజులు ఉంటాయన్నారు. ఒకొక్క యూనిట్ ధర రూ.4,450 కాగా చెల్లించిన సంఘాలకు పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా సంఘాల మహిళల కుటుంబాలు ఆరోగ్యం, పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ పథకం విజయవంతమైందని ఆయన పేర్కొన్నారు.

నియోజకవర్గంలో 680 మందికి నూతన పింఛన్లు

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: నియోజకవర్గంలో 680 నూతన పింఛన్లు మంజూరయ్యాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. నాలుగు మండలాల్లో అవసరాన్ని బట్టి అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని నివేదిక ఇచ్చిన వెంటనే దెందులూరు నియోజకవర్గం ప్రాధాన్యతను గుర్తించి 680 పింఛన్లను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం సచివాలయంలో ఎమ్మెల్యే కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త లబ్ధిదారులకు నగదు అందజేసిన వారి ఫొటోలను నాలుగు మండలాల నాయకులు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కార్యాలయానికి 94907 67567 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

సచివాలయ వ్యవస్థ ద్వారానే గ్రామాభివృద్ధి

పెదపాడు: గ్రామసచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు రానున్న ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. మండలంలోని వట్లూరులో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారానే అభివృద్ధి చేయగలమని భావించి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. వలంటీర్ల వవస్థ కూడా సక్రమంగా పని చేయడంతో అసలైన లబ్ధిదారులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. అయితే పార్టీ తరపున సచివాలయాల వారీగా సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణతో పాటు మరినన సేవలు అందించేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు నియమించామన్నారు. నియోజకవర్గంలో రూ.2700 కోట్ల సంక్షేమ పథకాలు అందించామన్నారు. నియోజకవర్గంలో 4 వేల మంది గృహసారథులు సచివాలయ కన్వీనర్లకు బీమా చేయిస్తామని తెలిపారు. నామినీగా కుటుంబసభ్యులందరినీ చేరుస్తామని వివరించారు. ప్రతీ గ్రామానికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి మండల సచివాలయ కన్వీనరు వచ్చి వివరాలు నమోదు సెప్టెంబరు 15 వరకూ చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల సతీష్ చౌదరి, ఘంటా ప్రసాదరావు, గుత్తా ప్రసాద్, మేకా లక్ష్మణరావు, మోరు రామరాజు, అక్కినేని రాజశేఖర్, అక్కినేని గోపి, కేశన సతీష్, కట్టా ఏసు, గుర్రం శివ, బత్తుల రత్నకుమారి, శ్రీనివాసరాజు, తాతా రమ్య, బి.సుమలత, నిట్టా లీలా నవకాంతం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దెందులూరుఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

నేడు గడపగడపకు 200వ రోజు

నిడమర్రు: ఉంగుటూరు నియోజకవర్గంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం శుక్రవారంతో 200వ రోజుకు చేరిన సందర్భంగా పెదనిండ్రకొలను గ్రామంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, జెడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, టీటీడీ పాలకవర్గం సభ్యులు గాదిరాజు పెదబాబు పాల్గొంటారన్నారు.

భీమడోలు: నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న 200వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు కోరారు. అదే విధంగా కేంద్ర పాలక కమిటీ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు టీటీడీ సభ్యుడుగా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా పెదనిండ్రకొలనులో మధ్యాహ్నం 2 గంటలకు స్వాగత, అభినందన ర్యాలీ నిర్వహిస్తున్నామని, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం

దెందులూరు: ప్రపంచంలో భాషలన్నింటికి ప్రధానమైన మూలనమైనది సంస్కృత భాష అని చల్లచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బీజీపీ పుష్పరాజ్ అన్నారు. గురువారం చల్లచింతలపూడి ఉన్నత పాఠశాలలో ప్రపంచ సంస్కృత దినోత్సవం నిర్వహించారు. తొలుత పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహానికి విద్యార్థులు పూజలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పుష్పరాజ్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక విజ్ఞాన, విద్య,వైద్యం, వ్యవసాయం ఈ భాష ద్వారానే మొట్టమొదటిసారిగా భారతదేశంలోనే అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలను పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించారు.

క్లోరినేషన్ చేసిన నీటినే అందించాలి

గణపవరం: ప్రజలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా అందించే నీటిని క్లోరినేషన్ చేసి, ఫిల్టర్ చేసి మాత్రమే సరఫరా చేయాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచించారు. గురువారం గణపవరం మండలం చిలకంపాడు, కాశిపాడు గ్రామాలలో వాటర్ ట్యాంకుల వద్ద ప్రజలకు అందిస్తున్న మంచినీటి నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. ప్రతిరోజూ 2 పీపీఎం క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే అందించాలని, పదిహేను రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకును శుభ్రం చేయాలని, ట్యాంకు శుభ్రపరచిన తేదీని బోర్డుపై నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చుక్కా అప్పారావు, కోట నాగేశ్వరరావు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.